
**బలహీనుడికి, దుర్మార్గం నచ్చకపోయినా యెదుర్కొనే శక్తి వుండదు. బలవంతుడికి శక్తి వుండటంవల్ల దుర్మార్గం చెలాయించాలనే చూస్తాడు. మరి, మార్గం యేమిటి?**

# బలవంతుని రాజ్యం

ఏనుగుల నరసింహారెడ్డి



"పిట్ట బావుందికోయ్."

'కొత్త మొహంలా వుందేంటి గురూ.'

'అవును ఎవరూ తోడు లేనట్లుంది.'

'ఎవరి కోసమో ?'

'ఇంకెవరికోసం, మనకోసమే అయి వుంటుంది.'

"ఇంతరాత్రిదాకా ఏం చేసిందో."

'ఇంకేం చేస్తుంది, ఏ లాడ్జింగులోనో టైం పాస్ చేసి వస్తున్నట్లుంది.'

ఈ మాటలన్నీ వింటున్న నాకు ఆవేశం పొంగింది. అంత పచ్చి మాటలు వినవలసివచ్చినందుకు సిగ్గనిపించిందికూడా. నేనే ఈ పరిస్థితిలో ఉంటే....పాపం ఆ అమ్మాయి ఇంకెంత బాధపడుతోందోనని జాలనిపించింది.

బస్ స్టాండులో నేనూ, ఆ అమ్మాయి గాక ఇంకో ఇద్దరు ముసలి దంపతు లున్నారు. అప్పుడే అక్కడికి వచ్చి ఆ అమ్మాయినలా అంటున్న వారిగురించి నాకు చూచాయగా తెలుసు. వాళ్ళంతా ఆ చుట్టుప్రక్కల ప్రదేశానికంతకూ పేరు గాంచిన గూండాలు. వాళ్ళపనే అది. దుకాణాల వాళ్ళిస్తున్న మామూళ్ళతో హాయిగా తిని, త్రాగటం. ఆపైన కనబడ్డ అమ్మాయిలను వేధించటం వారి దినచర్య.

వాళ్ళింకా దగ్గరికి వచ్చారు.

"ఏమండీ టైమెంతయింది?" వాళ్ళలో ఒకడడిగాడు ఆమెను.

ఆ అమ్మాయి బదులు చెప్పక భయంగా అర్థిస్తున్నట్లుగా నా వంకా, ముసలి దంపతుల వంకా చూసింది. నేనలానే అక్కడే. ఆ క్షణంలోనే ఆత్మాహుతి అయిపోతే బావుండుననిపించింది. ఆపదలో ఆదుకోమని ఆడపిల్ల అర్థిస్తున్నప్పుడు అసమర్థునిలా చూస్తూ ఉండవలసిన పరిస్థితి ఎదురయినందుకు.... ఛీఛీ ఏం బ్రతుకు!!

"ఎక్కడికి వెళ్ళాలి?"

అయినా మౌనమే వహించిందా అమ్మాయి. నిజానికి ఎవరైనా ఆ పరిస్థితిలో ఏమని సమాధానం చెప్పగలరు.

"ఏంటి నీ పొగరు?" బహువచనం లోంచి ఏకవచనంలోకి దిగాడు.

"మేమెవరమో తెలుసా, ఈ ఏరియాకంతకూ దాదాలం, మాకు ఎదురొచ్చే మొగాడేలేడు. మర్యాదగా మా ప్రశ్నలకు సమాధానం చెప్పు, లేకుంటే బావుండదు."

ఆ అమ్మాయి కళ్ళు వర్షించడానికి తయారుగా వున్నాయి.

"ఏంటయ్యా బుద్ధిలేదూ ఆడకూతుర్ని అల్లరిపెట్టడానికి. ఇంటిదగ్గర అమ్మా, అక్కలూ లేరా మీకు" కోపంగా అన్నాడు ముసలి వ్యక్తి.

"ఏయ్ ముసలాడా, తిక్క తిక్కగా మాట్లాడకు, ఒక్క గుద్దుకు చస్తావ్, అనవసరంగా జోక్యం చేసుకోకు." హెచ్చరించాడు ఒకడు. అతనిభార్య నోరుమూసుకొని కూర్చోమని భర్తను కసిరింది. ఇక తప్పేట్లు లేదనుకొని ఆ అమ్మాయి తనెక్కడికి వెళ్ళాలో చెప్పింది. "అయితే ఎక్కడ్నుంచి వస్తున్నావ్?"

"మా ఫ్రెండ్ యింటినుంచి" కంఠం వణుకుతుంది.

"ఎటువంటి ఫ్రెండ్, బాయ్ ఫ్రెండా?" వెటకారంగా అడిగాడు.

మౌనం వహించిందామె.

"ఈ కాలేజీ స్టూడెంట్స్ని నమ్మకూడదురా లాడ్జింగ్లో బాయ్ఫ్రెండ్స్తో...."

ఇక నేను భరించలేకపోయాను. నేను ఏదో ఒక పనిచేయాలి, జరుగుతున్నదానిని ఆపనయినా ఆపాలి, లేకుంటే అక్కడ్నుంచి వెళ్ళిపోవాలి. కాని నేను రెండో పని చేయలేకపోయాను. అంత సిగ్గుమాలిన పిరికి పని చేయడానికి మనసొప్పలేదు. అందుకే ముందుకు కదిలాను.

"చూడు పెద్దన్నా, ఈమె నీకేం కానప్పుడు అనవసరంగా దగరికి రాకు, బావుండదు" నన్నుచూస్తూ అన్నాడొకడు.

"మీరలా ఆమెను బనాయించడం బావు


పాఠకులకామె ఆరాధ్యరచయిత్రి
మేధావులకామె అభిమానరచయిత్రి
గృహిణులకామె అపురూప రచయిత్రి
పుస్తకప్రపంచంలో ఆమెనవలలకు సాటీ పోటీ లేదు
సినిమాల కామె నవలలు శత దినోత్సవాలు
ఆమె శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి
ఆమెనవలాహారంలోని నవరత్నాలే ఈ నవలలు

| | |
|---|---|
| సహజీవనం | 14-00 |
| ఈ దేశం మాకేమిచ్చింది | 12-00 |
| అనురాగ తోరణం (కథలు) | 10-00 |
| కీర్తికిరీటాలు | 15-00 |
| రాధాకృష్ణ | 16-00 |
| ప్రేమలేఖలు | 14-00 |
| స్నేహమయి | 12-00 |
| సంసారరథం | 10-00 |
| పార్థు | 12-00 |

అన్ని షాపులలో దొరకుతవి. లేదా మీకు కావలసిన పుస్తకాల ధర M.O. పంపండి 10పైసలకు V.P. పంపుతాము
క్వాలిటీ పబ్లిషర్స్ రామమందిరం వీధి విజయవాడ-2



సత్యం...మధురం...సుందరం
కొత్త 3-బ్యాండ్ల ఫిలిప్స్ ఫిలెటా



అది కూడా తక్కువ ధరలో 365/-* మాత్రమే
సర్వశ్రేష్ఠమైనదానినే మీరు పొందాలని మా వాంఛ
* సిఫారసు చేయబడ్డ వెల, ఎక్సైజ్ డ్యూటీతోసహా. స్థానిక పన్నులు అదనం. ఫిలిప్స్

పన్నులు అదనం
ఆథరైజ్డు మెయిన్ డీలర్సు
ఆడియో విజన్,
ఫోను : 76369
ప్రకాశం రోడ్డు,
విజయవాడ-2.

మండువేసవిలో చల్లని గాలికి!!!

ఉషా
టేబుల్ మరియు సీలింగ్ ఫ్యానులకు సంప్రదించండి
శ్రీ సీతారామా ఎలక్ట్రికల్స్
సామారంగం చౌక్
విజయవాడ-520001
ఫోన్ : 74039.

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
Samaj Kalyan (R.L. 78)
(P. O) Katri sarai (Gaya)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్ర స్ఖలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్
బి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010.
SUVARNA

లేదు" అన్నాను ధైర్యంగా.

"వీడెవడ్రో, తెలుగు సినిమా హీరోలా ఊడిపడ్డాడు."

"ఒరేయ్ ఇంట్లో చెప్పే వచ్చావా ?"

"పాపం ఫోజు కొట్టడానికి వచ్చి నట్టుంది" తలా ఓ మాటన్నారు.

"ఫోజు కొట్టడం కాదు. ఒంటరి అమ్మాయిని ఏడిపించడం బావుండదు. వదిలేయండి."

"ఎవరో ఆడపిల్లని ఏదో చేస్తే నీ కెందుకు బాధ. చూస్తేనేమో గట్టిగా వూదితే లేచి పోయేట్లున్నావ్. బుద్ధిగా వెళ్ళిపో."

"ముందు మీరు వెళ్ళిపోండి."

"అచ్చా, నీ కీరోజు పెళ్ళి కావలిసుం దన్నమాట. ఏంచేద్దాం" అని అతడంటుండ గానే యింకొకడు వెళ్ళి ఆ అమ్మాయి చెయ్యి పట్టుకున్నాడు.

నా శక్తిని గురించి ఆలోచించలేదు. ఒక్క దూకున వెళ్ళి వాడి చెయ్యిని లాగేసి తెలుగు సినిమాలోని ఫైటింగ్‌ను జ్ఞాపకం తెచ్చుకొని పిడికిలి బిగించి వాడి కడుపులో గుద్దాను.

నాకు అంతే జ్ఞాపకం ఉంది. తర్వాత ఏమయిందో తెలియదు. అందరి మధ్యా బంతిలా ఎగిరాను.

కళ్ళు తెరిచేసరికి రోడ్డు ప్రక్క వ మట్టిలో దుమ్ము కొట్టుకొని పడిఉన్నాను. నేను కళ్ళు తెరవడం చూసి ఎవరో ఎత్తు కెళ్ళి షెల్టరు క్రింద సిమెంటు బెంచీపై పడుకోబెట్టారు.

ఒళ్ళంతా వచ్చిపుండులా తయా రయింది. నా అవయవాలన్నీ పట్టుతప్పి ఉన్నాయి. గుమికూడిన నలుగురయిదు గురు గూండాల గురించి వ్యాఖ్యానం చేస్తు న్నారు. నన్నెందుకు ఎలా కొట్టారో ముసలి దంపతులు అందరికీచెబుతున్నారు.

"మరి ఆ అమ్మాయి ఏమయింది?"

"అదృష్టంకొద్దీ అప్పుడే బస్సొచ్చింది. అందులో వెళ్ళిపోయింది."

తృప్తిగా నిట్టూర్పుడిచి మెల్లిగా లేవ బోయాను.

"వద్దు వద్దు ఇప్పుడే లేవకు. దెబ్బలు బాగా తగిలాయి. ఎక్కడికెళ్ళాలి ?" అడిగా రెవరో.

చెప్పాను.

"దగ్గరేగా, రిక్షా పిలవనా ?"

"ఊఁ". అంగీకారంగా మూలిగాను.

అందరూ కలిసి నన్ను రిక్షాలో పడుకో బెట్టారు. రిక్షావాని సహాయంతో ఎలాగో రూంలోకి చేరాను.

నిద్ర రావడం లేదు.

శరీరంతోబాటు మనసుకూడా పాడ యింది.

వివేకానందస్వామి జ్ఞాపకం వచ్చాడు. నిజమే. ఆ మహానుభావుడు చెప్పింది అక్షరాలానిజం. బలహీనుడెప్పుడూ మృత ప్రాయుడే.

జీవం అంటేనే బలం. ధైర్యం అని అంటాడాయన.

ఎంత ఆవేశంవున్నా ఏం లాభం. నేను మృతప్రాయుణ్ణయినప్పుడు. ఈ లోకంలో బలహీనుడెప్పుడూ బల వంతుడి కాలిక్రింద చెప్పే. ఛీ ఛీ ఇలా రోజూ చస్తూ, బ్రతకడంకన్నా ఒకేసారి చావడం మేలు. ఓ భగవాన్! నాకుదారేది. ఇలా ఇంకొక్క క్షణం కూడా బ్రతక లేను. అన్యాయాల్ని ఎదిరించే శక్తి నాకివ్వు. అఘాయిత్యాల్ని అడ్డుకునే బల మివ్వు. అక్రమాల్ని అరికట్టే ఆత్మ స్థయిర్యాన్నివ్వు. అబలలను ఆదుకునే ఆత్మ విశ్వాసమివ్వు. పీడింపబడే బల హీనులను రక్షించే ధైర్యాన్నివ్వు. లేకుంటే నన్నిలానే చావనివ్వు!

ఇవే నా ఆలోచనలు.

ఆ తరువాత కొంతసేపటికి నాలో ఏవో మార్పులొస్తున్నట్లు— నేనేదో అయిపోతు న్నట్లు—

అదే ఆ రాత్రి ప్రత్యేకత!

* * *

ఉదయం నన్ను నేను చూసుకునే సరికి యెంత ఆశ్చర్యం. నేను యెంతో బలంగా, దృఢంగా తయారయ్యాను. నా శరీరం నాకే బరువనిపిస్తుంది. పాతబట్టలు బిగు తుగా తయారయ్యాయి. ముఖం కడుక్కొని టిఫిన్ తినడానికి బయలుదేరాను.

ఎందుకో నాకు మనుష్యులంతా చిన్న చీమల్లా కనిపిస్తున్నారు. వాళ్ళందరి కంటె నేనెంతో గొప్పవాడి నన్నట్లుగా అనుభూతి చెందాను. నా నడకలో ఆ విషయాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తున్నాను. హోటలు లోకి అడుగిడుతుంటే మేనేజరు వింతగా చూశాడు.

టేబిల్ ముందు కూర్చున్న అయిదు నిమిషాలకుకూడా సర్వరు రాకపోయే సరికి కోపం ముంచుకు వచ్చింది. మామూ లుగా రోజూ కుర్చీలో కూలబడి వచ్చి నప్పుడు ఆర్డరు యివ్వొచ్చులే అని కళ్ళు మూసుకొని కునుకు తీసేవాడిని. ఈ రోజు కోపంతోనీళ్ళగ్లాసును టేబిల్‌మీద బాదాను. శబ్దంతో గ్లాసు బ్రద్దలైంది. అందరూ తల త్రిప్పి చూశారు. సర్వరు పరిగెత్తు కొచ్చాడు.

"ఏంటి సార్ గ్లాసు పగలకొట్టారు."

"మరేం చేయమంటావ్ నీవెంతకూ రాకపోతే."

వాడు తనలోనే గొణుక్కుంటూ. "ఏం కావాలి?"

చెప్పాను.

తిన్న తరువాత బిల్లులో రూపాయిన్నర ఎక్కువ కనబడితే కాషియరును అడిగాను.

"మీరు పగలకొట్టిన గ్లాసు ఖరీదుసార్"

"సర్వరు రాకపోవడం అనేది మీతప్పు నే నివ్వను."

"ఇవ్వాల్సిందే."

"అట్లాగా. నేనీ బిల్లుకూడా ఇవ్వను. ఏం చేసుకుంటావో చేసుకో" అంటూ ముందుకు కదిలాను.

వెంటనే అతడు నా భుజం పట్టుకున్నాడు. ఒక్కటేదెబ్బ! చెయ్యి బలంగా విసిరాను. అతడు స్టూలు పైనుంచి దొర్లి పడ్డాడు. విలాసంగా బయటకు నడిచాను.

ఎదురుగా సిటీబస్సు వస్తోంది. ఆపమని చెయ్యి ఊపాను. నేను ఎక్కడానికి స్లో చేశాడు డ్రైవరు. వెనక ద్వారం ఖాళీగా ఉన్నా దానిలోంచి ఎక్కడం నా తాహతుకు తగదనిపించింది. స్టయిల్‌గా ముందునుంచి ఎక్కి ఫుట్‌బోర్డుపై నిలబడ్డాను. ఇదే డ్రైవరు ఒకప్పుడు బస్సు ఆగి ఉన్నప్పుడే ముందునుంచి ఎక్కబోతే కొట్టవచ్చినంత పని చేశాడు. ఇవాళ నాకెందుకో ఎంతో ఆనందంగా వుంది.

క్రిక్కిరిసివున్న ఆడవాళ్ళను చూస్తూనే అసభ్యకరమైన కామెంటు ఒకటి అప్రయత్నంగా నా నోటినుంచి వెలువడింది. మెచ్చుకోలుగా డ్రైవరు నా వంక చూసి నవ్వి నాతో కలిశాడు. మా మాటలువింటూ అమ్మాయిలు వొదిగొదిగి పోతూవుంటే అదో రకమైన మానసిక సంతోషం!

ఆ మధ్యాహ్నం సినిమాకని వెళ్తే పొడవుగావున్న లైను దర్శనమిచ్చింది. లైనులో వెళ్తే టికెట్ దొరికే అవకాశం కనిపించలేదు. ఛ. మనమేంటి. లైనులో నుంచోవడ మేంటి? ఎంత ఇన్‌సల్ట్! బుకింగ్ స్టార్ట్ అయ్యేవరకు దూరంగా నిలబడి తరువాత నేరుగా బుకింగ్ దగ్గరికి వెళ్ళాను. అక్కడున్న పోలీసు ఏదో చెప్పబోయాడు. "చుప్‌రహో బాయిసాబ్. నేనొక్క టికెట్టే తీసుకుంటున్నాను" కరుకుగా అన్నాను. మరింకేం మాట్లాడలేదతడు. అయినా పోలీసు తన డ్యూటీ మీరి ఎందుకు ప్రవర్తిస్తాడు. బలహీనుడిపై జులుంచలాయించడమే పోలీసుల డ్యూటీ. "ఓయ్ ఓయ్" అంటూ లైనులో కడుపు మండిన కొందరు అరిచారు.

"కోన్‌రే హమ్‌కో బోల్‌నేవాలా. బాహర్ ఆకే బోలో జబ్ బతావుంగా" కోపంగా అన్నాను. ఎవ్వరూ మాట్లాడలేదు. వాళ్ళలో వాళ్ళే గొణుక్కోసాగారు కాని. ధైర్యంగా ముందుకు ఎవ్వరూ రాలేదు. రారు- ప్రజల బలహీనత నాకు తెలుసు.

సీట్లో కూర్చుని ప్రక్కకు చూశాను. సన్నగా ఉన్నా యువకుడు దీక్షగా మ్యాస్ రీల్ చూస్తున్నాడు. ముఖంలో అమాయకత స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకో అతన్ని ఏడిపించాలనిపించింది.

భుజంమీద చెయ్యేసి "ఏం గురూ ఏం చదువుతున్నావ్?"

"బి. యస్సీ. ఫస్టియరండి." నా ఊహ నిజమయింది. అతడు మెతకమనిషే. ఎదురుతిరిగే స్వభావం వున్న వాడయితే నేను అలా అడిగేసరికి "ఎందుకు?" అని ఎదురుప్రశ్న వేసేవాడు.

ఆ తరువాత పేరు, కాలేజీ తెలుసుకొని "ఓహో, కో ఎడ్యుకేషన్ కాలేజీ అన్నమాట. యింకేం లక్కీ ఫెలోవి. యెవర్నయినా పట్టేశావా."

"లేదండి" సిగ్గుపడుతూ చెప్పాడా అబ్బాయి.

"ఏంటి. లేదా? అయ్యో" అంటూ నవ్వాను. మొహమాటంతో తనూ నవ్వాడు నా మాటలోని అర్థాన్ని గ్రహించక.

అతని చేతిలోని డిసెక్షను బాక్సుని "ఏంటీ చూసిస్తాను ఇటివ్వు" అంటూ లాక్కున్నాను. సినిమా అయినంతసేపూ అది నా దగ్గరే ఉంది. సినిమా వదిలిం తరువాత "నా డిసెక్షన్ బాక్సివ్వండి" అన్నాడా అబ్బాయి.

"ఏయ్. ఇది నీదెలా అవుతుంది. నా దగ్గరుంది నాదే" నవ్వుతూ అన్నాను.

భయంగా, బేలగా చూశాడు నా వంక.

నాకు మాత్రం తమాషాగా ఉంది.

"ప్లీజ్"

"ఎక్కువ మాట్లాడకుండా వెళ్ళు— ఒక్క ఫైట్ ఇస్తాను చస్తావ్" కరుకుగా అన్నాను.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి అతనికి.

ప్రక్కన వెళ్తున్న ఒకరిని ఆపి "చూడండి. ఇతను నా డిసెక్షను బాక్సు తీసుకొని ఇవ్వటం లేదు." దీనంగా అన్నాడు.

అతడు ఏదో అనబోతుండగానే "మైండ్ యువర్ బిజినెస్" అన్నాను కోపంగా. అంతే. అతను "సారీ" అంటూ వెళ్ళిపోయాడు.

నేను మామూలుగా నడవసాగాను.

"ప్లీజ్ ఇవ్వండి" గొంతు పూడుకుపోయింది. నాలో ఆనందంరెట్టింపయింది. ఒకర్ని ఏడిపించటంలో ఇంత ఆనందం ఉంటుందని నాకిప్పుడే తెలుస్తుంది.

"అయితే కూల్‌డ్రింక్ తాగిస్తావా? అలాగే ఇస్తాను" అన్నాను.

"సరే" ఏడుస్తూనే ఒప్పుకున్నాడు.

హోటల్లోంచి బయటకు వచ్చిన తరువాత డిసెక్షను బాక్సు ఇచ్చి నవ్వుకున్నాను.

ఆ తరువాత అక్కడక్కడా గడిపి రూంకు బయలుదేరాను. అదే బస్ షెల్టరు క్రిందికి వచ్చేసరికి అక్కడో అమ్మాయి ఉంది. ఆమెకు కొంచెం దూరంలో ఇద్దరు యువకులు నిలబడి ఏదో మాట్లాడుకుంటూ

## నెల్లూరి పాట

మా వూరు నెల్లూరు
మొలగొలుకులకు పేరు
కుంచాన్ని తలక్రింద
ఉంచి నిద్రోతున్న
రంగనాయకుని ప్రక్క
పెన్నా నదికి ప్రక్క
వేణుగోపాలయ్య
వెలసి వున్నాడయ్య
మూలపేటలోన
కేల వేణువుబూని

దర్గ మిట్టకాడ
ధర్మాసు పత్రంట
కన్నిక లాస్పత్రి
కాన్పులకు పేరంట

ట్రంకు రోడ్డులోనె
టౌను హాలున్నాది
పేట పేటలోన
మేటి సినిమాహాళ్లు
మద్రాసు టెలివిజను
మంచిగా గనపడును
పొట్టి శ్రీరాములకు
పుట్టిల్లు నెల్లూరు

అలనాడు తిక్కన్న
అలరించె నీ వూరు
పదునేను పర్వాలు
పండొలిచినట్లుగా
దీటుగా పల్కెను
తెనుగు నుడికారమున
నాజూకు పనితనపు
నగలు నెల్లూరివి
మోజుపడుదు రిచటి
భోజనాలకు పరులు
మంచి మనసుకు త్రాణ
నెలూరి నెరజాణ.

-గోపాలుని రాజగోపాలరావు

నవ్వుకుంటున్నారు. నాకు తెలుస్తూనేఉంది ఆ మాటలు ఆ అమ్మాయి గురించేనని. ఎప్పటిలా నాకు కోపం రాలేదు. నాకు తోడు దొరికారుకదా అన్న ఆనందం కలిగింది. వాళ్ళవైపు నడిచి వారితో కలిశాను.

"పాపం. హృదయం విచ్చుకున్న గులాబిలా వెళ్ళి యిప్పుడు వాడిపోయిన దానిలా వస్తుంది బాస్" అన్నాడొకడు.

"వాడిపోయినదానిలా కాదు గురూ, నలిగిపోయిన దానిలా" అన్నాను నేను నవ్వుతూ. తరువాత అంత అసభ్యంగా మాట్లాడింది నేనేనా అని ఆశ్చర్యపోయాను.

ఆ అమ్మాయి అనిశ్చితంగా కదిలింది.

"భలే మాటన్నావ్ భాయీ" మెచ్చుకున్నాడొకడు.

"నేను వెళ్ళి కొంచెం కదిలించి చూసేదా?"

"వద్దులేరా, అలా కనబట్టంలేదు."

ఇంతలో బస్సు రావడంతో ఎంతో పెద్ద గండం నుంచి బయటపడ్డదానిలా ఆ అమ్మాయి పరిగెత్తినట్లుగా వెళ్ళి బస్ ఎక్కింది. నేనూ ఎక్కి నా సేజీలో దిగి రూంలోకి వచ్చిపడ్డాను.

మనసంతా ఎంతో హాయిగా, ఆహ్లాదంగా ఉంది. నా జీవితంలో ఎన్నడూ పొందని ఆనందం ఈ రోజు పొందాను. ఎప్పుడూ ఆలోచనలతో, ఆవేదనతో నిద్ర దరి చేరకుండా ఉండే నాకు ఈ రాత్రి వెంటనే నిద్ర ఆవహిస్తుంది. నిద్రలో నన్నెవరో ఏమేమో అడుగుతున్నారు. తన ప్రశ్నలతో నన్ను హింసిస్తున్నారు.

"ఏమిటోయ్ నీ ఆదర్శాలన్నీ ఏమయ్యాయి. నీ మహోన్నతాశయాలేమయ్యాయి. ఇన్ని రోజులదాకా నీవు ఆలోచించేదేమిటి. బలవంతుడివై నీవీ రోజు చేసిందేమిటి. ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకో. కండ పెరిగేసరికి అందరిలానే నీకూ కళ్ళు నెత్తిమీది కెక్కాయి. ఉహూఁ నేను ఒప్పుకోను. ప్రజల మీదికి యింకో దుష్టశక్తిని నేను సృష్టించలేను."

* * *

ఉదయం ఒళ్ళంతా బరువుగావుంది. రాత్రి తగిలిన దెబ్బలతో ఒళ్ళు హూనమై పైకి లేవడానికికూడా చేతకావడంలేదు. అయ్యో ఎందుకు తెల్లారింది? నాలాంటి అసమర్థుని ఆక్రోశంలా, బలహీనుని ఆవేదనలా, పీడితుని ఆర్తనాదంలా ఈ రాత్రి ఇలానే ఉండిపోదెందుకని?! ●


## చిత్రకళ





స్థాపితం : 1907 ఫోన్ నెం 846 188

మీరు మీ ఇంటియందుండే తపాలా పాఠములద్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును. యావద్భారత దేశమునుండియు విదేశముల నుండియు అనేకమంది మన విద్యాలయములో విద్యార్థులుగా చేరి ఉత్సాహంతో శిక్షణ పొందుచున్నారు.

మీరు కూడా ఈ సులభపద్ధతులతో చిత్రకళ నభ్యసించుటకు సమ్మతించుచున్నారా? వివరముల కొరకు తొమ్మిది పది పైసల స్టాంపులు పంపండి.

**SANTHANU'S CHITRA VIDYALAYAM. (J)**
**179, Singanna Chetty St, Chintadripet, MADRAS-2.**



ఊరగాయలకు అమూల్యమైన నూనెలు

అగ్‌మార్కు కాబడిన

**A. S. బ్రాండ్ పప్పు నూనె**
**మేన్షన్ బ్రాండ్ నువ్వుల నూనె**

❊ ఊరగాయలను మెత్తబడనీయవు. ❊ బూజు పట్టనీయవు.
❊ చాలాకాలము నిల్వయుండును. ❊ అమితముగ రుచినికలుగజేయును

16, 4, 2 కేజీల డబ్బాలలో ప్యాకింగ్ చేయబడుచున్నవి.
ఇండియన్ గవర్నమెంట్ వారి అగ్‌మార్క్ సీలునుగమనించికొనుడి

డిపోలు : * డా. ఉళక్కి స్ట్రీట్ తెనాలి, ఫోన్ : 150
* 1-3-166, రాజా మొదలియార్ స్ట్రీట్.
కలాసిగుడ, సికింద్రాబాద్, ఫోన్ : 76160

బళ్ళారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల, బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగపూర్ లలో మా ఏజెంట్లు కలరు.

Manufacturers స్థాపితం : 1911

**అంబటి సుబ్బన్న & కో., సామర్లకోట**

ఇండియాలో కెల్లా పెద్ద అగ్‌మార్కు జింజిలీ ఆయిలు ప్యాకర్సు